పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 744 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ మంగళవారం 13.10.2026 పేజీలు : 8 వెల : 4/-

## ఆరు రాష్ట్రాలకు..

# కొత్త గవర్నర్ల నియామకం

- కేరళ నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్
- తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్
- కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకూ కొత్త గవర్నర్లు
- బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నియామకాలు అమల్లోకి



దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం తరువాయి 2లో



# 'వెంకటాద్రి' యాప్ ఆవిష్కరణ

- తిరుమల భక్తుల కోసం 'వెంకటాద్రి' నావిగేషన్ యాప్ ప్రారంభం
- రూ.3,222 కోట్లతో తిరుపతిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం
- అలిపిరి వద్ద యాత్రికుల కోసం సమీకృత టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
- మాస్టర్ ప్లాన్ రహదారులు, టీటీడీ ఉద్యోగుల లేఔట్ పనుల ప్రారంభం
- తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో తరువాయి 2లో

## ఆర్థిక శాస్త్ర నోబెల్ విజేతలు

# రాబర్ట్ హాల్, వుడ్‌ఫోర్డ్





2లో

- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోజనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు

## దక్షిణ కోస్తా, రాయలసీమకు

# భారీ వర్ష సూచన

- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన

4లో



## మోదీ పట్టుకు ట్రంప్ విలవిల..

# అమెరికా మాజీ అధికారి వెల్లడి

- మోదీ హ్యాండ్‌షేక్‌తో ట్రంప్ ఇబ్బంది పడ్డారన్న జాన్ బోల్టన్
- మోదీ శారీరక బలాన్ని ప్రస్తావించిన మాజీ సలహాదారు
- ఆర్‌టీ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో బోల్టన్ వ్యాఖ్యలు
- ట్రంప్ హ్యాండ్‌షేక్ శైలిపై గతంలోనూ చర్చ
- ఎదుటివారిని తనవైపు లాగే అలవాటు ట్రంప్‌కు ఉందన్న విశ్లేషణ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హ్యాండ్‌షేక్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎదుటివారితో కరచాలనం చేస్తూనే తనవైపు బలంగా లాగడం ఆయన శైలిగా మారింది. ప్రపంచ నేతలతో ట్రంప్ కరచాలనం చేసిన సందర్భాలు గతంలో చాలాసార్లు చర్చకు వచ్చాయి. అయితే, ప్రధాని నరేంద్ర మోదీతో కరచాలనం చేసినప్పుడు మాత్రం ట్రంప్ ఊపిరి తీసుకోవడానికి తరువాయి 2లో

# ఆసుపత్రుల దోపిడీపై కేంద్రం కొరడా

## రాష్ట్రాలకు ఆదేశాలు

- వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం
- ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్ట్రాలకు ఆదేశం
- రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం
- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలని సూచన
- విదేశీ రోగులకు అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రదర్శించాలని విజ్ఞప్తి



2లో

## ట్యాంకర్‌పై డ్రోన్ దాడి..

# ఇద్దరు భారత నావికులు మిస్సింగ్

- మరో 9 మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడిన అధికారులు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న భారత ప్రభుత్వం

2లో





## సౌదీపై దాడి: రంగంలోకి అమెరికా..

# మరింత భీకరంగా యుద్ధం?

- సౌదీపై హూతీల దాడులతో పెరిగిన ప్రాంతీయ ఉద్రిక్తతలు
- యెమెన్‌లో సౌదీ మద్దతుతో ప్రభుత్వ దళాల ఎదురుదాడి
- అమెరికా ప్రత్యక్ష సైనిక చర్య చేపట్టే అవకాశంపై చర్చ
- సౌదీ రక్షణకు టర్కీ, పాకిస్థాన్ మద్దతు కీలకం
- హూతీల క్షిపణులు, డ్రోన్లు సౌదీకి సవాలు

2లో

# ‘వెంకటాద్రి’ యాప్ ఆవిష్కరణ: సీఎం చంద్రబాబు

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు ‘వెంకటాద్రి’ పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత ‘గోవింద’ వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా),



టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

*** అలిపిరి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్**

ఈ అభివృద్ధి పనుల్లో అత్యంత కీలకమైనది అలిపిరి వద్ద ఎస్వీ జూపార్క్ రహదారిలో నిర్మించతలపెట్టిన సమీకృత యాత్రికుల టౌన్‌షిప్. దీని నిర్మాణానికి సుమారు రూ.2,750 కోట్లు వెచ్చించనున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడి తగ్గించి, తిరుపతిలోనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో పది అంతస్తుల చొప్పున నాలుగు బ్లాకుల్లో 2,700 గదులను నిర్మించనున్నారు. దీని ద్వారా రోజుకు దాదాపు 16 వేల మందికి వసతి అందుబాటులోకి వస్తుంది. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో సమీకృత రవాణా టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

**మౌలిక సదుపాయాల విస్తరణ**

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల వ్యయంతో 20 కిలోమీటర్ల పొడవున తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ రహదారులు జాతీయ రహదారుల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయి. శ్రీవారి సేవలో నిరంతరం పనిచేసే టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 418 ఎకరాల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఔట్లలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉంటే, వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందిస్తారని సీఎం అన్నారు.

**సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

తిరుమల తరహా పవిత్రతను తిరుపతిలోనూ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణం, సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, ‘వృక్షో గోవింద’ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో తిరుపతిని వివాహ వేడుకలకు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

### ఆరు రాష్ట్రాలకు
## కొత్త గవర్నర్ల నియామకం

దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు. వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు కేరళ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది. ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

### సౌదీపై దాడి: రంగంలోకి అమెరికా..
## మరింత భీకరంగా యుద్ధం?

మధ్యప్రాచ్యంలో ఇప్పటికే రగులుతున్న యుద్ధాగ్ని మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. సౌదీ అరేబియాపై హూతీల దాడులు.. యెమెన్‌లో సౌదీ మద్దతుతో జరుగుతున్న సైనిక చర్యలు.. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగే అవకాశాలు.. ఈ పరిణామాలన్నీ ప్రాంతీయ సంక్షోభాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. సౌదీపై దాడులతో మొదలైన తాజా ఉద్రిక్తత.. అమెరికా, టర్కీ, పాకిస్థాన్‌లనూ ఈ ఘర్షణలోకి లాగుతుందా? అన్న ఆందోళనలు పెరుగుతున్నాయి. సౌదీ రాజధాని రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయంపై శనివారం జరిగిన దాడిలో 12 మంది మరణించగా, దాదాపు 300కు పైగా మంది గాయపడ్డారు. ఆదివారం మరో దాడిలో ఒకరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. ఈ దాడులకు తామే బాధ్యులమని హూతీలు ప్రకటించారు. యెమెన్ రాజధాని సనాపై సౌదీ దాడులకు ప్రతిస్పందనగానే వీటిని చేపట్టినట్లు పేర్కొన్నారు. యెమెన్‌లో కీలక ప్రాంతాలపై హూతీలు పట్టు సాధించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎర్ర సముద్రం దక్షిణ ద్వారం వద్ద ఉన్న ‘బాబ్ అల్ మండెబ్’ జలసంధి సమీపంలో హూతీలు భూభాగాలను ఆక్రమించారు. ప్రపంచ వాణిజ్య నౌకాయానానికి ఈ మార్గం అత్యంత కీలకం. దీంతో యెమెన్ ప్రభుత్వ దళాలు ఎదురుదాడి ప్రారంభించాయి. వాటికి సౌదీ యుద్ధవిమానాలు మద్దతిస్తున్నాయి. హూతీల అధీనంలోని మొఖా ఓడరేవును తిరిగి స్వాధీనం చేసుకున్నామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హూతీలు సౌదీపై దాడులను తీవ్రతరం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

**అమెరికా రంగంలోకి దిగుతుందా?**

సౌదీపై దాడుల్లో ఓ అమెరికా పౌరుడు మరణించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతోంది. హూతీలపై అమెరికా దాడులు చేపడుతుందా? అని ప్రశ్నించగా.. ఆ అవకాశాన్ని పరిశీలిస్తామని ట్రంప్ చెప్పారు. సౌదీకి ప్రత్యక్ష సైనిక సహాయం, గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం వంటి చర్యలు అవసరమని అమెరికా నిఘా విభాగంలో పనిచేసిన విలియం ఉషర్ అభిప్రాయపడ్డారు. అయితే ఇరాన్‌తో ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలన్నది వాషింగ్టన్ ముందున్న సవాలు.

**టర్కీ, పాకిస్థాన్ పాత్ర కీలకం**

సౌదీ అరేబియాతో ఆగస్టులో రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న టర్కీ, పాకిస్థాన్‌లపైనా ఇప్పుడు దృష్టి పడింది. సౌదీ రక్షణకు సైనికులు లేదా ఆయుధాలను అందించే అవకాశాలపై ఈ దేశాలు సానుకూల సంకేతాలిచ్చాయి. అయితే హూతీలపై దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొనే విషయాన్ని టర్కీ తోసిపుచ్చింది. ఈ దేశాలు ఎంతవరకు సౌదీకి అండగా నిలుస్తాయన్నది కీలకంగా మారింది.

**చమురు, వాణిజ్యంపై ప్రభావం**

సౌదీపై దాడులతో విమానాశ్రయ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అంతర్జాతీయ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. రియాద్‌లో జరగాల్సిన కీలక వ్యాపార కార్యక్రమాలపైనా ప్రభావం పడుతోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్న సౌదీకి ఈ పరిణామాలు సవాలుగా మారాయి. మరోవైపు, హూతీల వద్ద ఇరాన్ రూపకల్పన చేసిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. చౌకగా తయారు చేయగల డ్రోన్లతో సుదూర దాడులు చేసే సామర్థ్యం ఆ ముఠాకు ఉండటం సౌదీకి పెద్ద సమస్యగా మారింది.

**యుద్ధం విస్తరించే ప్రమాదం**

హూతీల దాడులను అడ్డుకోవడం సౌదీకి అంత సులభం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో సౌదీ, అమెరికా దాడులను ఎదుర్కొన్నప్పటికీ ఆ ముఠా తన సామర్థ్యాలను నిలబెట్టుకుంది. ఇప్పుడు సౌదీ మరింత తీవ్రంగా స్పందిస్తే హూతీలు ప్రతిదాడులకు దిగే అవకాశం ఉంది. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే ఘర్షణ మరింత విస్తరించవచ్చు. అదే జరిగితే యెమెన్‌కే పరిమితమైన పోరు.. మధ్యప్రాచ్యంలోని మరిన్ని దేశాలను ప్రభావితం చేసే సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది.

## మోదీ పట్టుకు ట్రంప్ విలవిల.. అమెరికా మాజీ అధికారి వెల్లడి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హ్యాండ్‌షేక్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎదుటివారితో కరచాలనం చేస్తూనే తనవైపు బలంగా లాగడం ఆయన శైలిగా మారింది. ప్రపంచ నేతలతో ట్రంప్ కరచాలనం చేసిన సందర్భాలు గతంలో చాలాసార్లు చర్చకు వచ్చాయి. అయితే, ప్రధాని నరేంద్ర మోదీతో కరచాలనం చేసినప్పుడు మాత్రం ట్రంప్ ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడ్డారని అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ వెల్లడించారు. ఆర్‌టీ ఇంటర్నేషనల్ కార్యక్రమం ‘న్యూ ఆర్డర్ విత్ అఫ్షిన్ రత్తాన్సీ’లో పాల్గొన్న బోల్టన్ ఈ విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ ఇంటర్వ్యూ వీడియోను ‘ఎక్స్’లోనూ పంచుకున్నారు. “ఒకసారి ట్రంప్‌తో ప్రధాని మోదీ చాలా బలంగా కరచాలనం చేశారు. ట్రంప్ ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడ్డారు. మోదీ ఎంత బలవంతుడో ఈ సంఘటన గుర్తు చేస్తుంది” అని బోల్టన్ వ్యాఖ్యానించారు. ట్రంప్ హ్యాండ్‌షేక్ శైలి అమెరికా మీడియాలో గతంలోనూ విస్తృతంగా చర్చకు వచ్చింది. ఎదుటివారి చేతిని పట్టుకుని తనవైపు లాగడం ద్వారా ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తారని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. 2017లో ‘ది వాషింగ్టన్ పోస్ట్’ కథనం కూడా ట్రంప్ కరచాలనం చేసే తీరును ప్రస్తావించింది. అప్పటి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి నామినేట్ అయిన నీల్ గోర్సచ్, అప్పటి జపాన్ ప్రధాని షింజో అబేతో ఆయన కరచాలనం చేసిన సందర్భాలను ఉదాహరణలుగా పేర్కొంది. అదే ఏడాది సీఎన్ఎన్ కూడా ట్రంప్ హ్యాండ్‌షేక్‌పై విశ్లేషణ ప్రసారం చేసింది. ఆయన ఎదుటివారిని ఒక్క క్షణం పాటు తమ బ్యాలెన్స్ కోల్పోయేలా లాగుతారని బాడీ లాంగ్వేజ్ నిపుణుడు క్రిస్ ఉల్రిచ్ వ్యాఖ్యానించారు. సీబీఎస్ న్యూస్‌తో మాట్లాడిన మరో నిపుణుడు డాన్ ఖౌరీ ఈ విధానాన్ని ఆధిపత్యాన్ని చాటే చర్యగా అభివర్ణించారు. ట్రంప్ ‘షేక్ హ్యాండ్’లను ది వాషింగ్టన్ పోస్ట్ ‘ట్రంప్‌షేక్స్’గా పేర్కొనగా, టైమ్ పత్రిక వాటిని ఆధిపత్యం కోసం జరిగే పోరాటంగా అభివర్ణించింది. అప్పటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌లతో ట్రంప్ కరచాలనం చేసిన సందర్భాలు కూడా అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. ఇప్పుడు బోల్టన్ చెప్పిన మోదీతో కరచాలనం ఉదంతం ఈ చర్చకు మరో ఆసక్తికరమైన అంశంగా నిలిచింది.

## ఆర్థిక శాస్త్ర నోబెల్ విజేతలు రాబర్ట్ హాల్, వుడ్‌ఫోర్డ్

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది. రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి. ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా ‘ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి’ అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

## ఆసుపత్రుల దోపిడీపై కేంద్రం కొరడా.. రాష్ట్రాలకు ఆదేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ 2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్ 2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు. ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ట్యాంకర్‌పై డ్రోన్ దాడి.. ఇద్దరు భారత నావికులు మిస్సింగ్

ఒమన్ తీరంలోని సోహార్ యాంకరేజ్ వద్ద ఒక పెట్రో ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. నిన్న చోటుచేసుకున్న ఈ ఘటనలో ఇద్దరు భారతీయ నావికులు గల్లంతయ్యారు. నికరాగ్వా జెండాతో ప్రయాణిస్తున్న ‘ఎంటీ పెట్రో డాల్ఫిన్’ అనే నౌకలో మొత్తం 11 మంది భారతీయ సిబ్బంది ఉండగా, వారిలో తొమ్మిది మందిని స్థానిక అధికారులు సురక్షితంగా రక్షించారు. గల్లంతైన మిగిలిన ఇద్దరి కోసం స్థానిక కోస్ట్ గార్డ్ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ ఘటనను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఒమన్ అధికారులతో తాము నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, సహాయక చర్యలను నిశితంగా పర్యవేక్షిస్తోందని ఆయన వెల్లడించారు. ఇటీవలి కాలంలో ఒమన్ సమీపంలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకపై దాడి జరగడం ఇది రెండోసారి. అక్టోబర్ 6న హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ‘ఎంటీ ఆన్ పీస్’ అనే ట్యాంకర్‌పై కూడా ఇటువంటి దాడే జరిగింది. ఆ నౌకలోని 19 మంది సిబ్బందిలో 17 మంది భారతీయులు కాగా, ఆ ఘటనలో 11 మంది భారతీయులు సహా మొత్తం 12 మంది గాయపడ్డారు. ఈ ప్రాంతంలో ఇలాంటి దాడులు పునరావృతం కావడంపై భారత్ గతంలోనే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

# విశేష అలంకరణలో అమ్మవారు

తెలుగు రాష్ట్రాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి దేవిని దర్శించుకుంటున్నారు.









## చరిత్రలో ఈ రోజు

### అక్టోబర్ 13

OCT 13

* ప్రపంచ ప్రకృతి వైపరీత్యాల నిరోధక దినోత్సవం.
* 1679: పెను తుపానులో కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రాంతంలో 20 వేలకు పైగా మృతిచెందారు.
* 1911: స్వామీ వివేకానందుని శిష్యురాలు, పూర్వాశ్రమంలో మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్ అనే పేరుగల సిస్టర్ నివేదిత మరణం (జ.1867).
* 1936: ప్రసిద్ధ సంగీతజ్ఞుడు, ప్రముఖ వైణికుడు చిట్టిబాబు జననం (మ.1996).
* 1948: విశ్వ విఖ్యాత సంగీతకారుడు నస్రత్ ఫతే అలీఖాన్ జననం (మ. 1997).



కిషోర్ కుమార్

* 1987: ప్రముఖ హిందీ సినీ గాయకుడు కిషోర్ కుమార్ మరణం (జ.1929).(చిత్రంలో)

## స్థానిక ఎన్నికలు..

### మేయర్, మున్సిపల్ స్థానాల రిజర్వేషన్లు ఖరారు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను ఏపీ ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి 1, జనరల్ మహిళలకు 5, అన్‌రిజర్వ్‌డ్ కోసం 4 స్థానాలు కేటాయిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

**మున్సిపల్ కార్పొరేషన్లు- మేయర్ రిజర్వేషన్**

మంగళగిరి తాడేపల్లి - ఎస్టీ
రాజమహేంద్రవరం - ఎస్సీ
కర్నూలు - ఎస్సీ
మచిలీపట్నం - బీసీ మహిళ
కాకినాడ - బీసీ మహిళ
ఏలూరు - బీసీ జనరల్
అనంతపురం - బీసీ జనరల్
చిత్తూరు - బీసీ జనరల్
విజయనగరం - జనరల్ మహిళ
శ్రీకాకుళం - జనరల్ మహిళ
గుంటూరు - జనరల్ మహిళ
కడప - జనరల్ మహిళ
విశాఖ - జనరల్ మహిళ
తిరుపతి - అన్‌రిజర్వ్‌డ్
విజయవాడ - అన్‌రిజర్వ్‌డ్
ఒంగోలు - అన్‌రిజర్వ్‌డ్
నెల్లూరు - అన్‌రిజర్వ్‌డ్

మరోవైపు రాష్ట్రంలోని 106 మున్సిపాలిటీలకు కూడా రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో ఎస్టీ జనరల్‌కు 2, ఎస్టీ మహిళలకు 1, ఎస్సీ జనరల్‌కు 7, ఎస్సీ మహిళలకు 7, బీసీ జనరల్‌కు 18, బీసీ మహిళలకు 18, జనరల్ అభ్యర్థులకు 26, జనరల్ మహిళలకు 27 స్థానాలకు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## విజయవాడలో ఘోర ప్రమాదం..

# నలుగురు సజీవ దహనం

విజయవాడ: విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈవీ కారులో మంటలు చెలరేగి.. నలుగురు సజీవదహనమయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి కొమ్మారెడ్డి అరుణ, ఓ చిన్నారి, నంబూరుకు చెందిన తిగురు విజయగా గుర్తించారు. నంబూరులోని ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుల బంధువులు ఘటనాస్థలికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.



## ఈ నెల 14న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్!

అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 14న విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నివాసంలో కూటమి నేతలు కీలక భేటీ నిర్వహించారు. జనసేన ప్రతినిధి మంత్రి నాదెండ్ల మనోహర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ భేటీలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కూటమి పక్షాల రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ భేటీ జరిగింది. ఈ భేటీలో తాము పోటీ చేసే స్థానాల జాబితాను జనసేన, భాజపా నేతలు ఇచ్చారు.



తాజా సమావేశంలో ఈ జాబితాపై తుది నిర్ణయం తీసుకున్నారు.

# విజయవాడలో కారు దగ్ధం..
# నలుగురి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, పవన్, లోకేశ్

- విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఎలక్ట్రిక్ కారులో చెలరేగిన మంటలు
- ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే సజీవ దహనం
- ఘటనపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- ప్రమాద కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని సూచన

విజయవాడ నగర శివార్లలోని వెస్ట్ బైపాస్ రోడ్డుపై ఘోర ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఓ ఎలక్ట్రిక్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ఈ తీవ్ర విషాద ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల



ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రుడికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనంలో మంటలు చెలరేగడానికి గల సాంకేతిక కారణాలపై దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ అధికారులను కోరారు. "విజయవాడ వెస్ట్ బైపాస్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు చనిపోవడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెయిలింగ్‌ను ఢీకొన్న వెంటనే కారు లాక్ అయి, మంటలు వేగంగా వ్యాపించడంతో లోపల ఉన్నవారు బయటకు రాలేకపోయారని తెలుస్తోంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## దక్షిణ కోస్తా, రాయలసీమకు
# భారీ వర్ష సూచన

దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

# జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

- కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి
- మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ



జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... "జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం" అని అన్నారు. పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ, ఈ విషయంలో మౌనంగా ఉంటూ నిందితుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం అంటే నిందితుడిని కాపాడటమేనని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనకు పాల్పడిన ఎంపీని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బహిష్కరించాల్సిందని, కానీ అతనికి రక్షణ కల్పించడం ద్వారా ఆ పార్టీ ద్వంద్వ వైఖరి బయటపడిందని పురందేశ్వరి దుయ్యబట్టారు. మహిళల భద్రత, గౌరవం పట్ల కాంగ్రెస్ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని ఆమె ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన, రాజకీయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ మహిళా మోర్చా పురందేశ్వరి నేతృత్వంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టింది.

# ప్రతి నియోజకవర్గంలో ఒక శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని
## ప్రభుత్వం నిర్ణయించింది: మంత్రి ఆనం

- శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఆలయాలు నిర్మించడమే లక్ష్యమన్న ఆనం
- ప్రతి నియోజకవర్గంలో రూ.5 నుంచి రూ.10 కోట్లతో శ్రీవారి ఆలయం
- 6,700 ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు నెలకు రూ.10,000 జమ

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 ఆలయాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఈరోజు జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 6,700 ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల ఖాతాల్లో ప్రతినెలా రూ.10,000 జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు.



సోమశిల జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, పట్టణంలో అంబేద్కర్, షాదీ మంజిల్ భవనాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని ఆయన అన్నారు.

## వివేకా హత్య కేసు
# ఈడీ విచారణకు హాజరైన శివశంకర్ రెడ్డి

- హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారుల విచారణ
- మనీలాండరింగ్ కోణంలో ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు
- సీబీఐ చార్జ్‌షీట్ ఆధారంగా కేసు నమోదు చేసిన ఈడీ



మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో 5వ నిందితుడిగా (A5) ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ఈరోజు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. హత్య కేసుతో సంబంధం ఉన్న ఆర్థిక లావాదేవీల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. వివేకా హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద కేసు నమోదు చేసింది. ఈ హత్య వెనుక రూ.40 కోట్ల సుపారీ లావాదేవీ జరిగిందని సీబీఐ తన చార్జ్‌షీట్‌లో ఆరోపించింది. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన ఆర్థిక మూలాలపై ఈడీ దృష్టి సారించింది. శివశంకర్ రెడ్డి ఈ కుట్రలో కీలకపాత్ర పోషించారని, నిధులను సమకూర్చుతానని హామీ ఇచ్చారని సీబీఐ ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే శివశంకర్ రెడ్డిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి గత ఆగస్టులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డితో పాటు శివశంకర్ రెడ్డి ఇళ్లలోనూ ఈడీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా, ఇదే కేసులో విచారణకు హాజరుకావాలని కడప వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డికి ఈడీ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 14న ఆయన విచారణకు రానున్నారు.

# విపక్షాల మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు..
## రాహుల్ తరపున సుప్రీంలో పిటిషన్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ సుప్రీంకోర్టు వరకు మార్చ్‌కు పిలుపునిచ్చింది విపక్ష ఇండియా కూటమి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. వీరి మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో విపక్ష ఎంపీలు, నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. ఓటు చోరీ అంశంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు లో స్వయంగా పిటిషన్ దాఖలు చేసేందుకు రాహుల్ బృందం బయల్దేరింది. విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి విపక్ష నేతలను నిలువరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఒకింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు..**



మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

## జంతర్ మంతర్ డీనోటిఫై..
## భాజపాకు అతిపెద్ద ఓటమే: అఖిలేష్ యాదవ్



ఢిల్లీలోని ప్రఖ్యాత జంతర్ మంతర్ ఇక నిరసనలకు వేదిక కాదని ఢిల్లీ పోలీసులు డీనోటిఫై చేయడంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ (Akhilesh Yadav) స్పందించారు. ఇది భాజపాకు అతిపెద్ద ఓటమి అని అన్నారు. 'ప్రజా ఆగ్రహానికి భాజపా ప్రభుత్వం భయపడుతుంది. అధికార ప్రాంతాలకు నిరసనకారులను దూరంగా పెట్టాలని చూస్తుంది. అందుకే దూర ప్రాంతాలను నిరసన ప్రాంతాలుగా గుర్తించింది. ప్రఖ్యాత జంతర్ మంతర్ ఇక నిరసనలకు ఏ మాత్రం వేదిక కాదని ఢిల్లీ పోలీసులు డీనోటిఫై చేయడం భాజపాకు అతిపెద్ద ఓటమే. ఇందుకు ప్రత్యామ్నాయంగా ప్రధాని నివాసం ఉండే లోక్ కల్యాణ్ మార్గ్‌ను నిరసనలకు వేదికగా కేటాయించాల్సింది. అప్పుడే ప్రజల సమస్యలు నేరుగా పాలకులకు తెలిసేవి' అని అఖిలేష్ అన్నారు.

# తిరుమల బ్రహ్మోత్సవాలు.. పెదశేష వాహనంపై విహరించిన శ్రీనివాసుడు

తిరుమల: తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా తొలి రోజు పెదశేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి తిరుమల మాడవీధుల్లో విహరించారు. కలియుగ వైకుంఠ నాథుడు తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు జరిగే పండుగే పెద శేషవాహన ఉత్సవం. ఆద్యంతం కనుల పండువగా సాగిన



ఈ సేవలో శ్రీనివాసుడు శేషతల్పంపై అధిష్ఠించి దర్శనమిచ్చారు. స్వామి కొలువున్న కొండ శేషాద్రి. అందుకే తొలిరోజు పెద శేష వాహనంపై నుంచి భక్తులకు అభయ ప్రదానం చేస్తారు. విషోగ్రుడైన శేషుని అధిష్ఠించిన దేవదేవుడు మానవుల్లోని కల్మషాన్ని హరిస్తాడన్నది ఈ సేవలోని అంతరార్థం. తిరు ఆభరణాల అలంకృతుడై ఉభయ దేవేరులతో కలగలిసి వీనులవిందు చేసే మలయప్పను దర్శిస్తే సర్వపాపాలు తొలగిపోతాయనేది భక్తుల విశ్వాసం.

## అమ్మే తొలి గురువు... కూచిపూడే ఊపిరి...

# సంస్కృతి సేవే పరమావధి!

కూచిపూడి నృత్య వారసత్వానికి ప్రాణవాయువు... ఆధునిక విజ్ఞానంతో భారతీయ సంస్కృతిని నడిపిస్తున్న యువతరంగం 'బెండాది శ్రీయ'

### సజీవ కళారూపం కూచిపూడి

తెలుగు నేల పురిటిగడ్డగా జనియించి, ప్రపంచ రంగస్థలంపై భారతీయ ఔన్నత్యాన్ని సగర్వంగా చాటిచెప్పిన మహోన్నత శాస్త్రీయ నృత్యరీతి కూచిపూడి. భక్తి, రక్తి, ముద్రలు, జతిస్వరాలు, లయబద్ధమైన పాదఘాతాలు, నవరసాల అభినయ విన్యాసం కలబోసిన ఈ దివ్య కళ కేవలం వినోద సాధనం మాత్రమే కాదు; అది ఆత్మసాక్షాత్కారానికి మార్గం. పాశ్చాత్య ధోరణులు, సాంకేతిక విప్లవం వెల్లువెత్తుతున్న వర్తమాన సమాజంలో ప్రాచీన సంస్కృతికి జీవం పోయడం యువతరం ముందున్న అతిపెద్ద సవాలు. ఆ సవాలును చిరునవ్వుతో స్వీకరించి, సంప్రదాయ కళను శ్వాసగా మార్చుకుంటూ ముందుకు సాగుతున్నారు యువ నర్తకి బెండాది శ్రీయ. తల్లి అడుగుజాడల్లో నడుస్తూ, గురుశిష్య పరంపరకు సరికొత్త అర్థం చెబుతూ, సామాజిక సేవతో తన నర్తన ప్రయాణాన్ని సుసంపన్నం చేసుకుంటున్నారు.

### కళా వారసత్వం: అమ్మే తొలి దైవం... తొలి గురువు

కళ అనేది రక్తంలో ప్రవహిస్తే వచ్చే అందమే వేరు. విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ కళాకారులు, సాంస్కృతిక సేవకులు బెండాది స్వర్ణలత, బెండాది చంద్రమోహన్ దంపతుల ముద్దుల కుమార్తె శ్రీయ. తల్లి స్వర్ణలత ప్రసిద్ధ కూచిపూడి నృత్య విద్వాంసురాలు, ఎందరో శిష్యులను తీర్చిదిద్దిన నిష్ణాతురాలైన నాట్య గురువు. సహజంగానే శ్రీయకు ఊయల నాటి నుంచే గజ్జెల ఘల్లుఘల్లులు, మృదంగ నాదాలు, తాళాల సవ్వడులు జోలపాటలయ్యాయి.

నడక నేర్చుకునే ప్రాయంలోనే తల్లి వద్ద నాట్యానికి అంకురార్పణ జరిగింది. శ్రీయకు తల్లే తొలి గురువుగా మారి కూచిపూడిలోని మౌలిక సూత్రాలైన అడవులు, స్థానకాలు, చారులు మొదలుకొని క్లిష్టమైన జతులు, భంగిమలు, భావాభినయాలు నేర్పించారు. వేదికపై పాత్రలో లీనమైపోయే తన్మయత్వం, చూపుల్లో కరుణ, కోపం, శృంగారం, హాస్యం వంటి నవరసాలను అలవోకగా పలికించే మెలకువలను తల్లి స్వయంగా దిద్ది తీర్చారు. చిన్నతనంలోనే తల్లితో కలిసి వేదికలు పంచుకుంటూ జుగల్బందీ ప్రదర్శనలతో కళారంగాన్ని ఆశ్చర్యపరిచారు శ్రీయ.

### రసజ్ఞులు మెచ్చిన 'నాట్యమయూరి'

సాధన ఎంత కఠినంగా ఉంటే, విజయం అంత శోభాయమానంగా ఉంటుంది. శ్రీయ చూపిన ఏకాగ్రత, పట్టుదల ఆమెను అనతికాలంలోనే ప్రతిభావంతురాలైన కళాకారిణిగా నిలబెట్టాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అనేక ప్రముఖ నగరాల్లో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీయ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు పండితులను, పామరులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా శ్రీకృష్ణ లీలలు, తరంగంపై ఇత్తడి పళ్లెం అంచుల్లో నిలబడి బిందెను తలపై మోస్తూ లయ తప్పకుండా చేసిన నాట్యవిన్యాసం ప్రేక్షకుల చేత జయజయధ్వానాలు పలికించింది. ఆమె చూపిన కళా ప్రతిభను, నాట్య నిబద్ధతను గుర్తించి కళాభిమానులు, సాంస్కృతిక సంఘాలు ఆమెకు 'నాట్యమయూరి' బిరుదును ప్రదానం చేసి సత్కరించాయి.

### శాస్త్ర సాంకేతికత & సంప్రదాయ కళల అరుదైన కలయిక

సాధారణంగా విద్యార్థి దశలో ఇంజనీరింగ్ చదువులంటేనే పుస్తకాలు, కోడింగ్, ల్యాబ్‌లు, ప్రాజెక్టులతో కాలమంతా సరిపోతుంది. అలాంటిది ఆధునిక యుగంలో సరికొత్త విప్లవాన్ని సృష్టిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (AI & ML) విభాగంలో శ్రీయ బీటెక్ పట్టాను సాధించారు. ఒకవైపు క్లిష్టమైన అల్గారిథమ్స్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ చేస్తూనే, మరోవైపు కూచిపూడి నృత్యంలో ఉన్నతమైన సర్టిఫికెట్ కోర్సులతో పాటు మాస్టర్స్ స్థాయి విద్యను విజయవంతంగా పూర్తి చేశారు.





టెక్నాలజీ మైండ్‌తో ఆలోచిస్తూనే, హృదయాన్ని ప్రాచీన సంస్కృతికి అంకితం చేసిన శ్రీయ ప్రతిభ నేటి తరం యువతకు సరికొత్త దిక్సూచి. "చదువు వేరు, అభిరుచి వేరు కాదు; మనస్సు లగ్నం చేస్తే రెండింటిలోనూ రాణించవచ్చు" అని తన నిరూపణ ద్వారా స్పష్టం చేశారు.

### 'నాట్యనిలయం' – భావితరాల నర్తన శిక్షణాలయం

తల్లి స్వర్ణలత మార్గదర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'నాట్యనిలయం' సంస్థ నిర్వహణలో శ్రీయ క్రియాశీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. నేటి తరానికి నృత్యాన్ని కేవలం వినోదంగా కాకుండా, వారి శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి, ఏకాగ్రతకు మరియు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే జీవన మార్గంగా మారుస్తున్నారు.

- సాంస్కృతిక స్పృహ: నృత్య శిక్షణలో సాంకేతిక అంశాలతో పాటు మన పురాణాలు, ఇతిహాసాలు, భక్తి తత్వాలను విద్యార్థులకు వివరిస్తూ భారతీయ మూలాలపై గౌరవం పెంచుతున్నారు.
- విలువలతో కూడిన బోధన: గురుశిష్య సంబంధం ఎంత పవిత్రమైనదో తెలియజేస్తూ, సాధనలో నిబద్ధతను, క్రమశిక్షణను నూరిపోస్తున్నారు. వందలాది మంది బాలబాలికలకు నాట్య శిక్షణనిస్తూ భవిష్యత్ తరానికి కళా వారసత్వాన్ని అందిస్తున్నారు.

### అభాగ్యుల కోసం అడుగులు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత శిక్షణ

శ్రీయ కళా ప్రస్థానంలో అన్నిటికంటే విశిష్టమైనది ఆమెలోని సామాజిక దృక్పథం. ఆర్థిక ఇబ్బందుల వల్ల శాస్త్రీయ కళలను నేర్చుకోలేని నిరుపేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల కోసం ఆమె నడుం బిగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి రుసుము తీసుకోకుండా, పూర్తి ఉచితంగా కూచిపూడి నృత్య శిక్షణ అందిస్తూ సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు.

### శ్రీయ మాటల్లో:

"కళ అనేది కొందరి సొత్తు కాదు. సరైన వేదిక, ప్రోత్సాహం లభిస్తే మట్టిలో మాణిక్యాల వంటి ప్రతిభావంతులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వెలుగులోకి వస్తారు. వారికి నా వంతుగా నాట్య విద్యను అందించడమే నేను భారతీయ సంస్కృతికి చేసే నిజమైన సేవ."

ఈ సేవాభావం సమాజంలో ఎందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. కళను వ్యాపారంగా మార్చుకుంటున్న నేటి రోజుల్లో, కళను ఉచితంగా సమాజానికి పంచుతున్న ఆమె విశాల హృదయం ప్రశంసనీయం.

### ముగింపు: భావితరాల బాటలో సంస్కృతి జ్యోతి

పాశ్చాత్య నాగరికత ప్రభావంలో మన ఉనికిని కోల్పోతున్న ఈ కాలంలో, మన జాతి మూలాలను నిలబెట్టేందుకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ కర్తవ్యాన్ని తన భుజస్కంధాలపై మోస్తూ, కళను నేర్చుకోవడమే సాధనగా, దానిని సమాజానికి పంచడమే బాధ్యతగా ముందుకు సాగుతున్నారు బెండాది శ్రీయ.

భారతీయ శాస్త్రీయ నృత్య వినువీధిలో 'నాట్యమయూరి'గా మరింతగా రెక్కలు విప్పి నాట్యం చేస్తూ, కూచిపూడి వైభవాన్ని దేశ విదేశాల్లో సమున్నతంగా నిలపాలని, ఆమె సంకల్పం విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిద్దాం!

**(కూచిపూడి నృత్య కళాకారిణి, అధ్యాపకురాలు – నాట్యనిలయం)**

# ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

- ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష
- త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం
- ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు



హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీమెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి..
# కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు



రియాద్: సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్‌లోని కింగ్ ఫహద్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని స్టార్‌బక్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా.. దాదాపు 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.

# భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీకి టాస్క్ ఇచ్చారు

: సీఎం రేవంత్



దిల్లీ: రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఓటు హక్కు కల్పించడానికి SIR చేపట్టారని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల ఓట్లను తొలగించడానికే దీనిని వినియోగిస్తున్నారని ఆరోపించారు. దిల్లీలో సీఎం మీడియాతో మాట్లాడారు. "మోదీ తన అధికారం నిలబెట్టుకునేందుకు గతంలో ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగాలను వాడుకున్నారు. ఇప్పుడు వాటితో పని జరగడం లేదని.. ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుంటున్నారు. భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించేందుకు ప్రస్తుతం SIRను తెచ్చారు. తమ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు టాస్క్ ఇచ్చారు. ప్రధానంగా భాజపాను వ్యతిరేకించేది.. యువత, నిరుద్యోగులు, పేదలు. వీరి ఓట్లను తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారు. సీఈసీలో తప్పులు జరిగాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారు. జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి అధికారిని తొలగించేందుకు మోదీకి అభ్యంతరం ఏమిటి?" "సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో భాజపా ఓడిపోయింది. ఈ ప్రక్రియ జరిగిన బిహార్, బెంగాల్‌లో భాజపా గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా.. మరి ఎందుకు తగ్గింది?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# చిన్నారి హత్య.. డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత






సికింద్రాబాద్: బొల్లారంలో హత్యకు గురైన చిన్నారి మోజెస్ అరేలియా (5)బంధువుల ఆందోళనతో డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. చిన్నారిని చంపిన నిందితుడు విక్రమ్‌ను తమకు అప్పగించాలని బంధువులు డిమాండ్ చేశారు. నిందితుడి వెంటనే బహిరంగంగా ఉరి తీయాలని విల్లా ఆర్కిడ్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు నినాదాలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. డబ్బు కోసం ఐదేళ్ల చిన్నారి మోజెస్‌ను.. సెక్యూరిటీ గార్డ్ విక్రమ్ దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. క్లబ్‌హౌస్ దగ్గర ఉన్న చిన్నారిని సెల్లార్‌లోకి తీసుకెళ్లి... కాళ్లు, చేతులు కట్టేసి, శరీరానికి పెద్ద రాయి కట్టి నీటి సంపులో పడేశాడు. చిన్నారి చనిపోయిందని నిర్ధారించుకుని..రాత్రి 7.30 గంటల సమయంలో సెల్లార్ నుంచి ఒక్కడే బయటకు వచ్చి సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడి వెళ్లిపోయాడు.

**హత్య చేసింది విక్రమ్ ఒక్కడే: సీపీ**

**సుమతి**

సెల్‌ఫోన్ సిగ్నల్స్, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించినట్లు సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. "నిందితుడి కోసం 10 బృందాలు గాలించాయి. క్లబ్‌హౌస్ సెల్లార్‌లోని సంపులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించాం. సెక్యూరిటీ గార్డుగా పని చేసి.. మానేసిన విక్రమ్‌కుమార్‌ను అనుమానించాం. చిన్నారిని కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేయాలని విక్రమ్ భావించాడు. చిన్న కుటుంబం, ధనిక కుటుంబం కాబట్టి డబ్బులు ఇస్తారని అనుకున్నాడు. చిన్నారిని బయటకు తీసుకెళ్లే అవకాశం లేదు కాబట్టి ముందే చంపేశాడు. హత్యలో మరెవరికీ ప్రమేయం లేదు. విక్రమ్ కుమార్ ఒక్కడే చేశాడు. చిన్నారిని చంపి సంపులో వేశాకే డబ్బుల కోసం తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు" అని డీసీపీ సుమతి వెల్లడించారు.

## రోడ్లపై కాదు.. ఆధారాలతో
# ఈసీ వద్దకు వెళ్లండి: ఈటల రాజేందర్

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన
- ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య
- ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని కలవాలని ప్రతిపక్షాలకు సూచన



ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. "ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

# బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ.. కోట్ల మంది ప్రజలపై లేదు: హరీశ్‌రావు




హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగా రైతులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియాతో మాట్లాడారు. "రైతుల కంటే ముఖ్యమైన అంశం ప్రభుత్వానికి ఏమి ఉంటుంది..? దేవాదుల, కల్వకుర్తిలో నీళ్లు లిఫ్ట్ చేసి ఉంటే కరవే ఉండేది కాదు. ఎల్‌నినో ఉందని ముందే తెలిసినా.. నీళ్లు లిఫ్ట్ చేసి పెట్టుకోలేదు. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తామని 29 టీఎంసీలు ఖాళీ చేశారు. పనులు చేయకుండా ప్రాజెక్టును వదిలేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా? కోట్ల మందికి తాగునీరిచ్చే ఈ ప్రాజక్టు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు? ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో 3 టీఎంసీలే ఉన్నా.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తున్నారు. బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ.. కోట్ల మంది ప్రజలపై లేదు. లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని ఆబ్కారీ మంత్రి చెబుతున్నారు. తాగునీటిని బీరు కంపెనీలకు ఇస్తోన్న మిమ్మల్ని ఏం చేయాలి" అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# నాంపల్లి ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్



హైదరాబాద్: నాంపల్లి ఏసీబీ కోర్టులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ కార్ రేసు కేసులో నిందితుల జాబితా నుంచి తన పేరు తొలగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్‌పై ఈనెల 30న విచారణ చేపడతామని పేర్కొంది. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్న సంగతి తెలిసిందే.

# ఖమ్మంలో తితిదే ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి భూమి పూజ



ఖమ్మం: జిల్లా కేంద్రంలోని ధంసలాపురం రెవెన్యూ పరిధిలో కొత్తగూడెం, అల్లీపురం గ్రామాల మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. చినజీయర్ స్వామి చేతుల మీదుగా శిలాన్యాస పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ భూమిపూజ మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేడుక నిర్వహించిన ప్రాంగణంలో దేవాలయ నమూనాతో చేపట్టిన అలంకరణ ఆకర్షణగా మారింది. ఆలయ శంకుస్థాపన వేడుకల్లో భాగంగా ప్రాతఃకాల కైంకార్యాలు పూర్తయిన తర్వాత సోమవారం ఉదయం 6గంటల నుంచే శ్రీవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆరు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం..
## తమిళనాడుకు రాజేంద్రవిశ్వనాథ్ అర్లేకర్



కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలకు గవర్నర్లను నియమించింది. కేరళం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు బదిలీ చేసింది. ఇప్పటివరకు ఆయన తమిళనాడు గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తించగా.. తాజాగా పూర్తి బాధ్యతలు అప్పగించింది. సిక్కిం గవర్నర్ ఓం ప్రకాశ్ మాథూర్.. కేరళానికి బదిలీ అయ్యారు. ఒడిశాకు బ్రజ్‌మోహన్ రామ్‌ను నూతన గవర్నర్‌గా నియమించింది. కర్ణాటకకు డా.సుధా యాదవ్, ఉత్తరాఖండ్‌కు డా.ధాల్ సింగ్ బైసెన్, సిక్కింకు దుశ్యంత్ గౌతమ్ గవర్నర్లుగా నియమితులైనట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటన చేసింది.

# ఫారం–6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు



బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం 6లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని స్పష్టం చేసింది. తాము బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం 6 లేదని పేర్కొంది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కొత్త ఫారం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం 6 లో ఎన్నికల సంఘం (EC) మార్పులు చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అందరినీ నమ్మించేందుకు ఆ ఫారాన్ని సుప్రీంకోర్టు ఆమోదించినట్లు సెప్టెంబరు 26న తప్పుడు ప్రకటన జారీ చేసిందని ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.




# యాపిల్ పండగ సేల్.. వీటిపై ₹15వేల వరకు డిస్కౌంట్

ప్రముఖ ఇకామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ పండగ సేల్స్ కొనసాగుతున్న వేళ.. అమెరికా దిగ్గజ సంస్థ యాపిల్ కూడా యాపిల్ ఫెస్టివ్ సేల్‌ను ప్రకటించింది. అక్టోబర్ 11 నుంచి నవంబర్ 11 వరకు నెల రోజుల పాటు ఈ సేల్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఎంపిక చేసిన ఉత్పత్తులను బ్యాంకు కార్డుల ద్వారా కొనుగోలు చేస్తే గరిష్ఠంగా రూ.15 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌లను అందించనుంది. ఇటీవల విడుదలైన ఐఫోన్ 18 సిరీస్‌పైనా ఆఫర్లు ఇస్తున్నట్లు ప్రకటించింది.

**ఆఫర్ల వివరాలు ఇవీ..**

* పండగ సేల్‌ను పురస్కరించుకుని యాపిల్ ఎయిర్‌పాడ్స్ 5 స్పెషల్ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. వైర్‌లెస్ ఛార్జింగ్ కేస్‌పై రంగోలీ డిజైన్‌తో దీన్ని తీసుకొచ్చింది. లిమిటెడ్ స్టాక్‌ను మాత్రమే అందుబాటులోకి తెచ్చినట్లు యాపిల్ తెలిపింది.
* ఇక ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ డ్యుయో కొనుగోళ్లపై రూ.7 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ లభిస్తుందని తెలిపింది. ఐఫోన్ 17, ఐఫోన్ 17ఈపై రూ.1000 డిస్కౌంట్ ఇస్తోంది.
* ఒకవేళ మీ పాత ఐఫోన్‌ను అప్‌గ్రేడ్ చేయాలనుకుంటే.. యాపిల్ ట్రేడ్ ప్రోగ్రాం కింద ప్రత్యేక ఆఫర్లు తీసుకొచ్చింది. రూ.81,500 వరకు ఎక్స్ఛేంజీ విలువను అందిస్తోంది.
* మ్యాక్ బుక్ నియోపై రూ.7 వేల వరకు ఆఫర్ ఇస్తోంది. 13 అంగుళాలు, 15 అంగుళాల మ్యాక్‌బుక్ ఎయిర్‌పై రూ.10 వేల డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది. 14 అంగుళాల, 16 అంగుళాల మ్యాక్‌బుక్ ప్రో మోడల్స్‌పై రూ.15 వేల క్యాష్‌బ్యాక్ అందిస్తోంది.
* డెస్క్‌టాప్ మ్యాక్‌ల కోసం చూస్తున్నట్లయితే.. ఐమ్యాక్, మ్యాక్ మినీపై రూ.5 వేలు, మ్యాక్ స్టూడియోపై రూ.10 వేలు చొప్పున డిస్కౌంట్ ఇస్తోంది. 11 అంగుళాలు, 13 అంగుళాల ఐప్యాడ్ ఎయిర్, ఐప్యాడ్ ప్రోపై రూ.5 వేలు, స్టాండర్డ్ ఐప్యాడ్, ఐప్యాడ్ మినీపై రూ.3 వేల క్యాష్‌బ్యాక్ ఇస్తోంది.



* యాపిల్ వాచ్ అల్ట్రా 4పై రూ.6 వేలు, యాపిల్ వాచ్ సిరీస్ 12పై రూ.4 వేలు, యాపిల్ వాచ్ ఎస్‌ఈ3పై రూ.2 వేలు క్యాష్‌బ్యాక్ ఆఫర్ చేస్తోంది. ఎయిర్‌ప్యాడ్ 5పై రూ.1000, ఎయిర్ ప్యాడ్స్ ప్రో 3పై రూ.2 వేలు, ఎయిర్‌పాడ్స్ మ్యాక్స్ 2పై రూ.4 వేల క్యాష్‌బ్యాక్ అందిస్తోంది.
* ఎంపిక చేసిన ఉత్పత్తులపై అమెరికన్ ఎక్స్‌ప్రెస్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డు హోల్డర్స్‌కు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ సదుపాయం ఉంది. 12 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐ వెసులుబాటును యాపిల్ కల్పిస్తోంది.

### రిటెయిల్ ద్రవ్యోల్బణం పైకి..

# సెప్టెంబర్‌లో 5.54%

ఢిల్లీ: దేశీయంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ ఏడాది సెప్టెంబరులో 5.54 శాతానికి చేరిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు ఆగస్టు నెలలో వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4.83 శాతంగా ఉంది. ఆహార పదార్థాల ధరలు పెరగడం ద్రవ్యోల్బణం పెరుగుదల కారణమని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ద్రవ్యోల్బణ గణాంకాలకు కొత్త విధానాన్ని కేంద్రం అనుసరిస్తోంది. ఈ సిరీస్ విడుదల తర్వాత ఈ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 5.97% ఉండగా.. సెప్టెంబర్ నెలలో 7.74



శాతానికి చేరింది. ద్రవ్యోల్బణ ఆందోళనల నేపథ్యంలోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత వారం రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన సంగతి తెలిసిందే. అయితే, ఆర్‌బీఐ నిర్దేశించుకున్న లక్షిత స్థాయి (2-6 శాతం)లోనే ఉండడం ఊరట కల్పించే అంశం.

# ఒక్క రోజే 4 మెయిన్ బోర్డు ఐపీఓలు.. వివరాలివే

అక్టోబరు 15న పబ్లిక్ ఇష్యూలు సందడి చేయనున్నాయి. ఒక్క రోజే 4 మెయిన్ బోర్డు ఐపీఓలు ప్రైమరీ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇస్తున్నాయి. దాదాపు రూ.9 వేల కోట్ల (రూ.8,873 కోట్లు) నిధులను సమీకరించనున్నాయి. ముఖ్యంగా జెట్‌వర్క్ మాన్యుఫాక్చరింగ్ బిజినెస్, బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ కంపెనీలు ఎక్కువ నిధులను సమీకరించనున్నాయి. మరి ఆ వివరాలు పరిశీలిస్తే..

* జెట్‌వర్క్ మాన్యుఫాక్చరింగ్ బిజినెస్ లిమిటెడ్ రూ.5,012 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబరు 15న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. 19న ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.143151గా కంపెనీ నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ అక్టోబర్ 14న తెరుచుకోనుంది. మొత్తం ఐపీఓలో రూ.2,830 కోట్ల తాజా షేర్లు, రూ.2,182 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూ నిధులను రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. ఈ కంపెనీ విద్యుత్, పునరుత్పాదక ఇంధనం,



రక్షణ, ఏఐ తదితర పరికరాలను తయారు చేస్తోంది.

* ఇటలీకి చెందిన బోన్‌ఫిగ్లియోలి భారత అనుబంధ కంపెనీ బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ లిమిటెడ్ రూ.2,534 కోట్ల నిధులను సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.558586. అక్టోబరు 15 19 మధ్య సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది. యాంకర్ బిడ్డింగ్ అక్టోబర్ 14న ఉంది. 4.32 కోట్ల షేర్లను పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో వాటాదారులు విక్రయిస్తున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీలో కంపెనీ షేర్లు అక్టోబరు 23న లిస్టింగ్ కానున్నాయి.
* రక్షణ విద్యుత్ పరికరాలను తయారు చేసే టోన్బో ఇమేజింగ్ కంపెనీ రూ.852 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో అక్టోబరు 15న పబ్లిక్ ఇష్యూకు వస్తుంది. 19న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. 1.22 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి రూ.665700.
* గుండె, రక్తనాళాలకు సంబంధించిన వైద్య పరికరాలను తయారు చేసే సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ రూ.475 కోట్ల నిధుల సమీకరణతో ఐపీఓకు వస్తుంది. అక్టోబర్ 15న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. 19న ముగియనుంది. ధరల శ్రేణి రూ.327344. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ అక్టోబర్ 14న తెరుచుకోనుంది. మొత్తం 1.38 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తిగా ఆఫర్ సేల్ ద్వారా విక్రయిస్తున్నారు. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు 50 శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు 15 శాతం, రిటెయిల్ ఇన్వెస్టర్లకు 35 శాతం చొప్పున వాటా కేటాయించారు. ఈ కంపెనీ షేర్లు అక్టోబర్ 23న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కానున్నాయి.

# TCSలో 80% ఫ్రెషర్లకు ఛాన్స్.. ఈ స్కిల్స్ ఉండాల్సిందే

ఢిల్లీ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఫ్రెషర్ల నియామకానికి సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చింది. కొత్తగా నియమించుకునే ఉద్యోగుల్లో ఇకపై 80 శాతం వరకు డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలు కలిగిన వారే ఉంటారని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆరతి సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం ఆదాయంలో ఏఐ ఆదాయం 10 శాతానికి పెరిగిందని, ఈ వాటా మరింత పెరిగితే కంపెనీ మార్జిన్లు మెరుగుపడతాయని తెలిపారు. ఈ మేరకు పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. రెండో త్రైమాసికంలో తాము నియమించుకున్న 4,500 మందిలో దాదాపు 25 నుంచి 30 శాతం మంది పూర్తిగా ఏఐపై పట్టున్నవారని సీఓఓ వెల్లడించారు. అందులో 80 శాతం మంది కొత్తతరానికి చెందిన వారేనని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే నిష్పత్తి నియామకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# యూట్యూబ్‌లో కోహ్లీ వీడియోలు చూసి నేర్చుకున్నా

**: ఆస్ట్రేలియా ఆటగాడు**

భారత్‌తో ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియాఎ జట్టు 21 తేడాతో కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆసీస్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ ఒక సెంచరీ సహా 194 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఈ క్రమంలోనే అతడు తన విజయ రహస్యాన్ని వెల్లడిస్తూ.. టీమ్ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ యూట్యూబ్ వీడియోలు చూసి, స్పిన్ బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నట్లు తెలిపాడు. "ఏ విదేశీ జట్టుకైనా భారత్‌లో సిరీస్ గెలవడం అంత సులభమైన విషయం కాదు. భారత్ పర్యటనకు వచ్చినప్పుడు సహజంగానే స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అందుకే స్పిన్నర్లను కోహ్లీ ఎలా హ్యాండిల్ చేస్తున్నాడో యూట్యూబ్ వీడియోల్లో చూశాను. అలాగే స్టీవ్ స్మిత్‌తోపాటు గతంలో ఇక్కడ రాణించిన ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల శైలిని కూడా గమనించాను. అంతేకాకుండా విశ్లేషకుల డేటానూ అధ్యయనం చేశాను. వాటిని మైదానంలో ఆచరణలో పెట్టి.. మంచి ఫలితాలు సాధించడం చాలా సంతోషాన్నిచ్చింది" అని మెక్‌స్వీనీ చెప్పాడు. అంతకుముందు భారత్‌తో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో తన ఆటతీరుపై స్పందిస్తూ.. "భారత్‌లో ఆడేటప్పుడు తొలి ఇన్నింగ్స్‌కు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అయితే.. మ్యాచ్ సాగుతున్న కొద్దీ బ్యాటింగ్ కష్టమైంది. భవిష్యత్తులో భారత్‌లో ఆడే అవకాశం వస్తే టెస్టుల తొలి ఇన్నింగ్స్‌ల్లోనే భారీ స్కోరుపై దృష్టి పెడతాను" అని తెలిపాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 10తో గెలుచుకుంది.



నాలుగు ఇన్నింగ్స్‌ల్లో మెక్‌స్వీనీ (0, 35, 34, 36) పెద్దగా రాణించలేకపోయాడు.




### భారత్-శ్రీలంక మ్యాచ్ వేదిక మార్పు వార్తలు..

# స్పందించిన బీసీసీఐ

భారత్-శ్రీలంక మధ్య డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డే మ్యాచ్ వేదికను దిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు మారుస్తున్నట్లు వస్తున్న కథనాలను బీసీసీఐ ఖండించింది. నిబంధనల ప్రకారమే ఆ మ్యాచ్‌ను దిల్లీకి కేటాయించారని, వేదిక విషయంలో ఎటువంటి మార్పు చేయలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. "దిల్లీలో జరగాల్సిన భారత్ శ్రీలంక తొలి వన్డేను అహ్మదాబాద్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. బీసీసీఐ అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. నిర్ణీత ప్రామాణిక విధానాన్ని అనుసరించే ద్వైపాక్షిక మ్యాచ్‌ల వేదికలను కేటాయిస్తారు" అని సైకియా వివరణ ఇచ్చారు. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్మాణ పనులు జరుగుతున్నందున.. ఆ మ్యాచ్‌ను




అహ్మదాబాద్‌కు మారుస్తున్నారనే ప్రచారం మొదలైంది. ఇదిలా ఉండగా.. భారత్ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు మూడు వన్డేలతో పాటు మూడు టీ20ల సిరీస్ కూడా ఆడనుంది.

# సచిన్, యువీ, గంభీర్‌లను ఎందుకు తప్పించామో వాళ్లకు తెలుసు: సందీప్ పాటిల్

భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, జహీర్ ఖాన్ వంటి వారిని జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో లేదా వారు ఎందుకు రిటైర్ అవ్వాల్సి వచ్చిందో ఆ కారణాలు వారికే తెలుసని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెలిపాడు. భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత సంబంధాల కంటే దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు. 1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన సందీప్ పాటిల్, 2012 నుంచి 2016 వరకు ఐదుగురు సభ్యుల సీనియర్ సెలక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో పాటిల్ ఈ విషయాలను వెల్లడించాడు. "ముందుగా ఒకటి స్పష్టం చేయాలనుకుంటున్నాను.



ఈ నిర్ణయాలు నేను ఒక్కడినే తీసుకున్నవి కావు. ఐదుగురు సభ్యుల సెలక్షన్ ప్యానెల్ ఉండేది, నేను దానికి ఛైర్మన్‌ను మాత్రమే. మేము తీసుకున్న ప్రతి నిర్ణయం భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదే" అని వివరించాడు. 2011 వన్డే ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులో సమూల మార్పులు అవసరమయ్యాయి. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ ఆటగాళ్ల స్థానంలో యువ ప్రతిభకు అవకాశం కల్పించారు. "సచిన్, గంభీర్, యువరాజ్, జహీర్ వంటి గొప్ప ఆటగాళ్లు జట్టుకు దూరమవడం బాధాకరమే. కానీ, ఆ కారణాలు వారికి తెలుసు. సెలెక్టర్లుగా దేశం, బీసీసీఐ, భారత క్రికెట్ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వడమే మా కర్తవ్యం" అని పాటిల్ తెలిపాడు. ఆటగాళ్లతో స్నేహం ఉండొచ్చు కానీ, వృత్తిపరమైన బాధ్యతల విషయంలో ఒక హద్దు ఉండాలని పాటిల్ అభిప్రాయపడ్డాడు. "అతడు నా స్నేహితుడు కాబట్టి జట్టులోకి తీసుకుంటాను అని చెప్పలేం. ఈ బాధ్యతను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కొన్నిసార్లు మనకు నచ్చని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది, కానీ భారత జట్టు మంచి కోసమే వాటిని అమలు చేయాలి" అని పేర్కొన్నాడు. తమ నిర్ణయాలు దీర్ఘకాల స్నేహాలను కూడా ప్రభావితం చేశాయని, అయినా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశాడు.

### ఎల్లుండే మ్యాచ్..

# ఇప్పటి వరకు 25వేల టికెట్లు విక్రయం

హైదరాబాద్: భారత్ వెస్టిండీస్ మధ్య హైదరాబాద్ వేదికగా బుధవారం జరగనున్న టీ20 మ్యాచ్ కోసం ఇప్పటి వరకు 25 వేల టికెట్లు విక్రయించినట్లు హెచ్‌సీఏ వెల్లడించింది. ఉప్పల్ స్టేడియంలో గరిష్ఠంగా 55 వేల మంది మ్యాచ్‌ను వీక్షించే అవకాశముంది. ఈ మ్యాచ్ కోసం 2,200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్‌లు ఉంటాయని చెప్పారు. 408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సోషల్ మీడియాలో ఫేక్ టికెట్లపైనా నిఘా ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. దాదాపు 40వేల మంది మ్యాచ్‌కు వచ్చే



అవకాశముందని, 8వేలకు పైగా వాహనాలను సైతం పార్కింగ్ చేసుకునేలా స్థలాలను ఏర్పాటు చేశామని చెప్పారు. తొలుత ఆటగాళ్లు బంజారాహిల్స్‌కు అక్కడి నుంచి స్టేడియానికి వస్తారని తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 8 షీ బృందాలు మఫ్టీలో ఉంటాయని పేర్కొన్నారు. "మ్యాచ్‌కు వచ్చేవాళ్లు వీలైనంత వరకు ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# క్యాచ్‌ల వేటలో తిలక్ వర్మ అరుదైన రికార్డు.. భారత క్రికెటర్లలో టాప్!



భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడిగా నిలిచాడు. అంతేకాదు.. ఈ మైలురాయిని అత్యంత సమర్థంగా చేరుకున్న భారత ఫీల్డర్‌గా రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్‌తో ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు.

**68 మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు**

తిలక్ వర్మ కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు పట్టాడు. ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించడంలో అతడు ముందున్నాడు. కనీసం 50 ఔట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న భారత ఆటగాళ్లలో ఇదే అత్యుత్తమ నిష్పత్తి. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో యూఏఈ ఆటగాడు మహమ్మద్ వసీమ్ మాత్రమే తిలక్ కంటే ముందున్నాడు. వసీమ్ 99 మ్యాచ్‌ల్లో 76 క్యాచ్‌లు అందుకుని 0.767 నిష్పత్తితో అగ్రస్థానంలో ఉన్నాడు.

**భారత దిగ్గజాల సరసన చోటు**

టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో తిలక్ ఐదో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ 65 క్యాచ్‌లతో అగ్రస్థానంలో ఉండగా.. హార్దిక్ పాండ్యా 64, సూర్యకుమార్ యాదవ్ 58, విరాట్ కోహ్లీ 54 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



## ట్రాఫిక్ సమస్యకు బాలకృష్ణ సహకారం..

### ఎన్టీఆర్ జ్ఞాపకాలతో ముడిపడిన ఇంటి స్థలాన్ని వదులుకోనున్నారా..!

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ప్రభుత్వం, అధికారులు పలు అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ముఖ్యంగా కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో పాటు ప్రధాన కూడళ్ల విస్తరణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో టాలీవుడ్ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు చెందిన నివాస స్థలంలో కొంత భాగాన్ని రోడ్డు విస్తరణ కోసం సేకరించే ప్రతిపాదన చర్చనీయాంశంగా మారింది. ఈ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం ఇచ్చేందుకు బాలకృష్ణ సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. బాలకృష్ణ నివాసానికి నందమూరి కుటుంబంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన తండ్రి, దివంగత నందమూరి తారక రామారావు 1982లో ఈ ఇంటిని నిర్మించారు. అప్పటి నుంచి ఈ నివాసం బాలకృష్ణ జీవితంలో ముఖ్య భాగంగా నిలిచింది. ఎన్టీఆర్ అభిమానులను కలుసుకోవడంతో పాటు పలు రాజకీయ, సినీ సంబంధిత కార్యక్రమాలకు కూడా ఈ ఇల్లు వేదికగా నిలిచినట్లు చెబుతారు. అందుకే ఈ నివాసం కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. నందమూరి కుటుంబానికి సంబంధించిన జ్ఞాపకాలతో ముడిపడిన ప్రదేశంగా గుర్తింపు పొందింది. అలాంటి ఇంటి స్థలంలో కొంత భాగాన్ని రోడ్డు విస్తరణకు ఇవ్వాలనే ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే భూమి సేకరణకు సంబంధించిన తుది నిర్ణయాలు, బాలకృష్ణ నివాసాన్ని ఖాళీ చేస్తారా లేదా అనే అంశాలపై అధికారికంగా మరింత స్పష్టత రావాల్సి ఉంది.కాగా, బంజారాహిల్స్ నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు రోడ్డు నంబర్ 45 కీలక మార్గంగా ఉంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జంక్షన్‌ను విస్తరించడం ద్వారా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచాలని అధికారులు భావిస్తున్నారట. ఈ విస్తరణలో భాగంగా బాలకృష్ణ నివాసానికి చెందిన సుమారు 862.77 చదరపు గజాల స్థలాన్ని సేకరించాల్సి ఉంటుందని సమాచారం. ఈ ప్రతిపాదనకు బాలకృష్ణ సానుకూలంగా స్పందించినట్లు వార్తలు వెలువడ్డాయి. మరి దీనిపై పూర్తి క్లారిటీ రావలసి ఉంది.

## పోతురాజు పూనినట్లు పోతుగడ్డ ఆడదా..



ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా నుంచి 'కోబలి..' సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'రేగే ఉరుము దరువు నిన్ను ముట్టగా.. అష్టదిక్కులే పిక్కటిల్లవా.. జోగే రేయిలోన పగల సెగలిలా పొగులుతుండగా.. పగలు పుట్టదా.. మూగే సావునైన సంపడానికీ.. సత్తువియ్యరా.. కాలకాలుడా.. పెన్నే రెల్లెతేరు ఉరకలెత్తగా సిందు తొక్కమా భద్రమల్లడా.. సామీ.. నీ వరం.. కాదా ఆయుధం.. లోకం.. కన్ను సెదర పోతురాజు పూనినట్ల పోతుగడ్డ ఆడదా..' అంటూ గూస్‌బంప్స్ తెప్పించే సంగీత సాహిత్యాలతో ఈ పాట సాగింది. కేశవాదిత్య రాసిన ఈ పాటను అజయ్‌అతుల్ స్వరపరచగా, వీఎం మహాలింగం మెస్మరైజ్ చేసేలా పాడారు. ఈపాటలో విజయ్ దేవరకొండ ఫెరోషియస్‌గా కనిపించారు. అర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటించిన ఈచిత్రానికి రచన: ప్రమోద్ తమ్మినేని, కెమెరా: నీరవ్ షా, జిష్ణు భట్టాజిష్ణు భట్టాచర్జీ, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్, టీసిరీస్ ఫిల్మ్స్.



## కుర్రాళ్ల గుండెల్లో బాణాలు గుచ్చింది..

ఆరాధ్య దేవి అసలు పేరు శ్రీలక్ష్మి సతీష్. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న ఈ భామను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన సినిమాలో కథానాయికగా పరిచయం చేశారు. సోషల్ మీడియాలో ఆమె వీడియోలు చూసిన వర్మ.. ఆమెను హీరోయిన్‌గా తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆమెతో 'శారీ' సినిమాను రూపొందించారు. ఈ చిత్రంతో ఆరాధ్య దేవి పేరు సినిమా ప్రేక్షకుల్లోనూ చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆమె గ్లామర్ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో సోషల్ మీడియాలో మంచి గుర్తింపు సంపాదించుకుంది. సోషల్ మీడియాలో రీల్స్ చేసే సమయంలో సంప్రదాయబద్ధమైన చీరకట్టులో కనిపించిన ఆరాధ్య దేవి.. సినిమాల్లో మాత్రం గ్లామరస్ లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో ఆమె పాత వీడియోలు, తాజా ఫొటోలను పోలుస్తూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు సోషల్ మీడియా ద్వారా వచ్చిన గుర్తింపును సినిమా అవకాశాలుగా మార్చుకోవడం ఈ రోజుల్లో కొత్త విషయం కాకపోయినా.. ఆరాధ్య దేవి విషయంలో మాత్రం ఆమె గ్లామర్, సినిమాల ఎంపికపై ఆసక్తి నెలకొంది. ఇకపై ఎలాంటి కథలు, పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తుందో చూడాలి. గ్లామర్ పాత్రల విషయంలో తన ఆలోచనలు మారాయని ఆరాధ్య దేవి గతంలో చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఒకప్పుడు గ్లామరస్ పాత్రలు చేయకూడదని అనుకున్నప్పటికీ, ఇప్పుడు తన అభిప్రాయాలు మారాయని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. గ్లామర్ అనేది వ్యక్తిగతమైన విషయమని, అది తన వృత్తిలో భాగమని ఆమె అభిప్రాయపడినట్లు ప్రచారం జరిగింది. గ్లామరస్ పాత్రలైనా, ఇతర విభిన్నమైన పాత్రలైనా తనకు వచ్చిన అవకాశాన్ని బట్టి నటించడానికి సిద్ధమనే సంకేతాలు ఇచ్చింది.

## ఏమీ చేయలేకే గతాన్ని తవ్వుతారు!

'మనల్ని విమర్శించడానికి ఏమీ దొరకనప్పుడు మన గతాన్ని వెలికితీస్తారు. చవకబారు ఆరోపణలు చేసి ఏదో సాధించామని సంబరపడిపోతారు. నా విషయంలో అదే జరిగింది. ఎవరితోనైనా ప్రేమగా మాట్లాడినా, చిరునవ్వుతో పలకరించినా లవ్‌ఎఫైర్ అంటూ ప్రచారం చేశారు. నా స్నేహితుల దగ్గరి నుంచి ప్రేమించే వ్యక్తుల వరకూ.. ప్రతి ఒక్కరిని పరిచయం చేయడానికి నేను ఇష్టపడతాను. ఎప్పటికప్పుడు నా సినిమా విశేషాలను పంచుకుంటూ సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటాను. ఇంత ఓపెన్‌గా ఉంటున్నప్పటికీ నా మీద ఎందుకు పుకార్లు వ్యాప్తి చేస్తారో అర్థం కాదు. కొన్నిసార్లు వారి వినోదం కోసం వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తుంటారు' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. ఆమె తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ఇటీవలే ఓటీటీలో ప్రేక్షకుల ముందుకొచ్చింది.



## ఏం సిరీస్ రా బాబు..!

### చూస్తే మెంటలెక్కాల్సిందే.. IMDbలో 10కి 8 రేటింగ్



ప్రస్తుతం సినిమాలతో పాటు ఓటీటీ వెబ్ సిరీస్‌లకు కూడా ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ప్రతి వారం కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా హారర్, సస్పెన్స్, థ్రిల్లర్ కథలకు ప్రేక్షకులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వెబ్ సిరీస్ మాత్రం విడుదలైనప్పటి నుంచి ప్రత్యేకమైన క్రేజ్‌ను సంపాదించుకుంది. అదే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'వెడ్నెస్‌డే' వెబ్ సిరీస్. ఈ వెబ్ సిరీస్ మొదటి సీజన్ 2022 నవంబర్‌లో విడుదలైంది. మొత్తం 8 ఎపిసోడ్‌లలో వచ్చిన ఈ సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులోని హారర్ సన్నివేశాలు, మిస్టరీ, సస్పెన్స్‌తో పాటు ప్రధాన పాత్రలో నటించిన జెన్నా ఒర్టెగా నటనకు మంచి గుర్తింపు లభించింది. ఈ సిరీస్‌ను అల్ఫ్రెడ్ గోఫ్, మైల్స్ మిల్లర్ రూపొందించారు. ప్రముఖ కార్టూనిస్ట్ చార్లెస్ ఆడమ్స్ సృష్టించిన 'వెడ్నెస్‌డే ఆడమ్స్' పాత్ర ఆధారంగా దీనిని తెరకెక్కించారు. మొదటి సీజన్‌లోని నాలుగు ఎపిసోడ్‌లకు ప్రముఖ దర్శకుడు టిమ్ బర్టన్ దర్శకత్వం వహించారు. ఒకప్పుడు టీవీ యాంకర్.. ఇప్పుడు ఇండస్ట్రీలోనే టాప్ హీరోయిన్..హీరోలకు మించి క్రేజ్ మొదటి సీజన్ విజయంతో 'వెడ్నెస్‌డే'కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు పెరిగారు. దీంతో రెండో సీజన్‌పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో రెండో సీజన్ 2025 ఆగస్టులో విడుదలైంది. మొత్తం 8 ఎపిసోడ్‌లతో రూపొందిన ఈ సీజన్‌ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మిగిలిన ఎపిసోడ్‌లు 2025 సెప్టెంబర్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చాయి. ఈ సిరీస్‌లో జెన్నా ఒర్టెగాతో పాటు ఎమ్మా మైయర్స్, హంటర్ దూహాన్, జాయ్ సండే, కేథరీన్ జీటా జోన్స్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. పాత్రల మధ్య సంబంధాలు, ఊహించని మలుపులు, రహస్యాల చుట్టూ సాగే కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 'వెడ్నెస్‌డే' సిరీస్‌కు IMDbలో 10కి 8 రేటింగ్ ఉన్నట్లు పేర్కొనబడింది. నెట్‌ఫ్లిక్స్‌లో హిందీ డబ్బింగ్‌తో పాటు సబ్‌టైటిల్స్‌తోనూ వీక్షించే అవకాశం ఉంది. హారర్, మిస్టరీ కథలను ఇష్టపడేవారికి ఈ సిరీస్ మంచి ఎంపికగా నిలుస్తోంది. మొత్తానికి, ఆసక్తికరమైన కథనం, భయపెట్టే సన్నివేశాలు, జెన్నా ఒర్టెగా నటన ఈ వెబ్ సిరీస్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. అందుకే 'వెడ్నెస్‌డే' ఇప్పటికీ ఓటీటీ ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా కొనసాగుతోంది. మీరు కూడా ఇప్పటివరకు ఈ సిరీస్ చూడకపోతే, నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉందో లేదో పరిశీలించవచ్చు.